క్లుప్తంగా

అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలి



ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల సముదాయాల సమావేశంలో భాగంగా స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులతో మంగళవారం జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహానంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో అమలవుతున్న ఎఫ్ఎల్ఎస్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలని అన్నారు. భాష, గణిత భావనల అభివృద్ధికి కృషి చేయాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. కలెక్టర్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్, జీహెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, కాంప్లెక్స్ కార్యదర్శి శ్రీనివాసులు, సీఆర్పీలు ఉన్నారు.

టాలెంట్ టెస్టు నిర్వహణ



అమరచింత: ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మంగళవారం సైన్స్ టాలెంట్‌టెస్టును నిర్వహించారు. అమరచింత ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన తస్లీ మాబేగం, మస్తీపురం ప్రభుత్వ పాఠశాలకు చెందిన లావణ్య ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు, ఈసందర్భంగా హెచ్ఎం బలరాం, సైన్స్ ఉపాధ్యాయులు స్వామి, సురేష్ విద్యార్థులను అభినందించారు.

ఆదర్శ దంపతుల ఆత్మీయ సమ్మేళనం



వనపర్తి టౌన్: కులాంతర వివాహం చేసుకున్న ఆదర్శ దంపతుల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవనంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రేమ పెళ్లిళ్లు చేసుకొని కష్టాలు ఎదురైన పలువురికి ఆదర్శంగా ఉండాలని, జీవితంలో ఒంటెద్దు పోకడలు కాకుండా ఒకరికొకరూ సమస్యను ఆకలింపు చేసుకొని ముందుకు సాగితే ఉత్తమ జీవిత గడపొచ్చని ప్రజాసైన్స్ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎల్. మురళీధర్ అన్నారు.

కుంగ్‌ఫూ విద్యార్థులకు అభినందన



వనపర్తి: ఇటీవల హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2023 కుంగ్‌ఫూ చాంపియన్ షిప్ పోటీల్లో వనపర్తి విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. మంగళవారం వారిని మంత్రి నిరంజన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. నరేష్, నవీన్, తేజ, హర్షిణి, బాసిని బంగారు పతకం, భానుప్రకాష్ వెండి పతకం దక్కించుకున్నారు. మరికొందరు విద్యార్థులు కటాస్ విభాగంలో ప్రతిభ చూపించి పతకాలు సాధించుకున్నట్లు మాస్టర్ రాము తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌడనాయక్, ఆసీఫ్, వజ్రాల రమేష్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి



అమరచింత: స్థానికులు సకాలంలో ఇంటి, ఇతర పన్నులను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని పురపాలిక కమిషనర్ మహ్మద్‌ఖాజ అన్నారు. మంగళవారం కార్యాలయం సిబ్బందితో కలిసి పట్టణంలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి పన్నులు చెల్లించాలని అభ్యర్థించారు. పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని, పట్టణం పరిశుభ్రంగా ఉండేందుకు సహకరించడంతో పాటు చెత్తను ఎక్కడిబడితే అక్కడ వేయకుండా చెత్తబండ్లలోనే వేయాలని కోరారు.

ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని తాటిపాములకు చెందిన వేణుగోపాల్ గ్రూప్–2, ఎస్ఐ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన వాడు కావడంతో కోచింగ్ తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాడు. యోగానందరెడ్డి సమస్యను మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి మంగళవారం వనపర్తి క్యాంపు కార్యాలయంలో వేణుగోపాల్‌కు రూ.15 వేల ఆర్థికసాయం అందించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య కార్యక్రమాలు, అసంక్రమిత వ్యాధుల నివారణ, వ్యాయామం, యోగ, ధ్యానం, సైక్లింగ్‌పై గ్రామస్తులకు, విద్యార్థులకు అవగాహన కల్పించి ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యపు అలవాట్లలో మార్పులు, శారీరక శ్రమ, వ్యాయామం చేయడంతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే రోగాలకు దూరంగా ఉంటామన్నారు. 30ఏళ్లకు పైబడిన ప్రతి ఒక్కరూ విధిగా హైపర్ టెన్షన్, డయాబెటిస్, క్యాన్సర్, టీబీ, కుష్టు వంటి వ్యాధులకు పీహెచ్‌సీల్లో పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులను పొందాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు, పీహెచ్‌సీ సూపర్ వైజర్లు సంతోషమ్మ, సుమనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండల కేంద్రంతో పాటు కంభాళాపురంలో మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యాధికారి రాముడు చిన్నారులతో సైకిలింగ్ ర్యాలీ నిర్వహించి, క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది తిరిగి ఎవరైతే దగ్గు, ఆయాసం, బరువు తగ్గడం, జ్వరం, తెమడలో రక్తం పడడంతో ఇబ్బందులు పడుతున్నారో గుర్తించాలన్నారు.



వీపనగండ్లలో వ్యాయామంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న వైద్యాధికారి వంశీకృష్ణ



కంభాళాపురంలో..



పాన్‌గల్‌లో..

వ్యాయామంతో ఆరోగ్యం

వీపనగండ్ల: క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చనని మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఎదుట అధికారులు, విద్యార్థులతో కలిసి శారీరక వ్యాయామంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి రాజశేఖర్, సర్పంచ్ నర్సింహారెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

వనపర్తి టౌన్: దళిత వర్గాల ఆశాజ్యోతి, సమతావాది దామోదర్ సంజీవయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగు ప్రజలకు ఎనలేని సేవలు చేశారని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ పేర్కొన్నారు. దామోదర్ సంజీవయ్య జయంతిని మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 38ఏళ్ల వయస్సులోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదర్ ఎన్నికకావడం దళితులకు ఎనలేని కీర్తిని తెచ్చిపెడుతుందన్నారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, కవి డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, డప్పు నాగరాజు, గద్వాల కృష్ణ, సులిగిరి వెంకటస్వామి, ప్రతాప్, దాసరి ప్రవీణ్, బాలస్వామి నాయుడు, రఘు నాయుడు, దేవన్న నాయుడు, పరమేశ్వరచారి, సత్యం చారి, నిదర్శన్‌గౌడ్, రిటైర్డ్ డీఎస్పీ అమృత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తాగునీటి సరఫరాలో అంతరాయం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని కేడీఆర్‌నగర్‌లో రామన్‌పాడు మెయిన్ పైపులైన్ ఇంటర్ లింక్ కలుపుతున్నందున తాగునీటి సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు మున్సిపల్ ఇంజినీర్ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం అంతరాయం కలిగే కాలనీలు కేడీఆర్ నగర్, బసవన్నగడ్డ, గ్యాస్ గోదాం లైన్, శారదానగర్, కొత్తకోట మెయిన్ రోడ్డు, బ్రహ్మంగారి వీధి, వెంగళ్‌రావుకాలనీ, సాగర్‌కాలనీ, సాయినగర్‌కాలనీ, విజయ్యాకాలనీ, జంగిడిపురం, రాజీవ్‌గృహకల్ప, న్యూగంజ్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు వెల్లడించారు. ఆయా కాలనీల ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కొత్తకోట: ఇటీవల కేరళ రాష్ట్రంలోని త్రిశూరలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చాటిన ఉపాధ్యాయుడు మురళీకృష్ణను ఎంఈఓ కృష్ణయ్యతో పాటు, పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా వనపర్తి జిల్లా తరపున ఉపాధ్యాయ విభాగం నుంచి కొత్తకోట మండలం రామకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించే హెచ్ఎం మురళీకృష్ణ వెదురు బొమ్మలు, ఆటల ద్వారా భౌతికశాస్త్ర బోధన అనే అంశాన్ని ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శనగా ఎంపిక చేయబడ్డారు. దీంతో ఉపాధ్యాయులు ఆయనను శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సెక్రెటరీ జయమ్మ, ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, సురేష్, ఈశ్వరయ్య, నాగన్నగౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఓటరు ఐడీ నంబర్ ఇవ్వాలి

వనపర్తి క్రైం: చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్, హైదరాబాద్ ఆదేశాల మేరకు వనపర్తి మండలానికి చెందిన టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్‌గా నమోదు చేసుకున్న వారు ఐడీ నెంబర్ ఇవ్వాలని తహసీల్దార్ రాజేందర్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు వెయ్యి మంది టీచర్ల ఓటర్లను నమోదు చేశారని, వాటిలో సుమారు 60 నుంచి 70శాతం టీచర్లు ఓటరు ఐడీ నెంబర్ ఇవ్వలేదన్నారు. తప్పనిసరిగా ఉపాధ్యాయులు ఐడీ జిరాక్సను తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని ఆయన కోరారు.

నర్సరీల్లో మొక్కలు సంరక్షించాలి

వీపనగండ్ల: తెలంగాణకు హరితహారంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతుందని, వాటిని సంరక్షించడంలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నర్సరీతో పాటు కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించారు. కంటి శిబిరానికి వస్తున్న ప్రజల వివరాల నమోదును ఆయన పరిశీలించారు. కంటి వెలుగు కార్యక్రమం ప్రజలకు మేలు చేసేదని, ఆ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, సర్పంచ్ నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌గౌడ్, ఏపీఓ శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న అధికారి సుధాకర్‌రెడ్డి

బదిలీల్లో అవకాశం కల్పించాలి

కొత్తకోట: ప్రస్తుతం రాష్ట్రంలో జరగబోయే ఉపాధ్యాయుల బదిలీల్లో మ్యూచువల్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జీఓ నంబరు 317 ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులు ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మ్యూచువల్ బదిలీ అయ్యారని, మానవతా దృక్పథంలో వారికి కూడా ఈ బదిలీల్లో అవకాశం కల్పించాలని ఆయన కోరారు. అందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ప్రత్యేకంగా పోస్టులో వినతిపత్రం పంపినట్లు ఆయన తెలిపారు.

నకిలీ ధ్రువపత్రాలతో అర్హులకు అన్యాయం

వనపర్తి: కొందరు సకలాంగులైన ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీల కోసం నకిలీ వికలత్వ ధ్రువపత్రాలను సమర్పించే ప్రయత్నం చేస్తున్నారని, వారి వలన నిజమైన దివ్యాంగులు నష్టపోతున్నారని ఉపాధ్యాయ దివ్యాంగుల జేఏసీ కన్వీనర్ నాయకులు నల్లెల రాజయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయంపై ఇదివరకే.. విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టినప్పుడల్లా దివ్యాంగులకు సంబంధించిన ప్రాధాన్యత క్రమంపై స్పష్టత రావట్లేదన్నారు. ప్రస్తుత ఉత్తర్వుల్లో వైకల్యం కలవారు సదరం లేదా మెడికల్ బోర్డు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను సమర్పించవచ్చని పేర్కొనటంతో మళ్లీ అక్రమ మార్గాలు వెదుకొన్నే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులకు తలనొప్పిగా మారుతున్న ఈ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు.

బైక్, కారు ఢీ: ఇద్దరికి గాయాలు

గోపాల్‌పేట: బుద్దారం గండి సమీపంలో కారు, బైకు ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బుద్దారం గ్రామానికి చెందిన చంద్రయ్య కుటుంబ సభ్యులు మంగళవారం సాయంత్రం కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. బుద్దారం గండి దాటిన తర్వాత ఉన్న ప్రమాదకర మలుపు వద్ద శానాయిపల్లికి చెందిన మనోజ్, శివ అనే యువకులు బైకుపై శానాయిపల్లి నుంచి బుద్దారం వైపు వస్తుండగా కారు, బైకు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో యువకులు ఇద్దరూ గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యువకులను ఆస్పత్రికి తరలించారు.

బాల్యానాయక్ ఎన్నికపై హర్షం

పాన్‌గల్: గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన గిరిజన నాయకుడు బాల్యానాయక్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై ఆ సంఘం నాయకులు తెల్లరాళ్లపల్లితండా సర్పంచ్ శాంతమ్మ, అన్నారంతండా సర్పంచ్ రంగానాయక్, కిష్టాపూర్‌తండా సర్పంచ్ దేవీసింగ్, సంఘం నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బాల్యానాయక్ ఆధ్వర్యంలో గిరిజన సంఘం మరింత బలోపేతం అవుతుందని వారు పేర్కొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోండి

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగును స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ దీపిక, కంటి వెలుగు డీఈఓ గోపాల్‌నాయక్, ఎంపీఓ నర్సింహులు అన్నారు. మంగళవారం అమరచింత మండలంలోని నందిమల్ల ఎక్స్‌రోడ్‌లో కంటివెలుగు కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు.

403 మందికి..

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు కేతేపల్లి, బుసిరెడ్డిపల్లిలో మంగళవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 403 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. వీరిలో 30 మందికి కంటి అద్దాలు, 30 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం సిఫార్సు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బహదూర్‌గూడెం, కేతేపల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో కంటి వెలుగు పరీక్షలు నిర్వహిస్తారని, ఈ కార్యక్రమంపై ఆయా గ్రామాల్లో సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశామన్నారు.

269మందికి..

ఖిల్లాఘనపురం: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం మొత్తం 269 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సౌజన్యలత తెలిపారు. ఖిల్లాఘనపురం పీహెచ్‌సీ పరిధిలోని ఆముదంబండ తండాలో 145 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి అద్దాలు పంపిణీ చేశారు. అదేవిధంగా ఒక్కరికి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు తెలిపారు. కమాలోద్దీన్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలోని రోడ్డుమీది తండాలో మొత్తం 124 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఏడుగురికి కంటి అద్దాలు అందించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాంచందర్‌రెడ్డి, మక్బూల్ పాష పాల్గొన్నారు.



నందిమల్ల ఎక్స్‌రోడ్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని వెంకటాపురం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో నలుగురికి రీడింగ్ అద్దాలను పంపిణీ చేశామని, ఆరుగురికి అద్దాల తయారీకి పంపిచామన్నారు. ఇద్దరిని ఆపరేషన్ అవసరం ఉన్న వారిగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎం అనురాధ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతోనే సృజనాత్మకత

వనపర్తి టౌన్: పోటీ పరీక్షలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపడంతో పాటుగా తుది పరీక్షలకు సంసిద్ధులను చేసేందుకు దోహదపడతాయని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ పేర్కొన్నారు. రామన్ ఐఐటీ టాలెంట్ టెస్ట్ కరపత్రాలను మంగళవారం రేడియంట్ పాఠశాలలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు గణిత, భౌతిక, రసాయన శాస్త్రాలపై జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలో విజేతలకు రూ. 30 వేల నగదును ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈ నెల 26న వనపర్తి పట్టణంలో పరీక్షను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రామన్ ఐఐటీ నిర్వాహకుడు రాములుయాదవ్, ప్రముఖ గాయకుడు, జీహెచ్ఎం రమాకాంత్, తెలుగుబాషా సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, వ్యాఖ్యాత బైరోజు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



టాలెంట్ టెస్ట్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

విద్యార్థులు దేశం గర్వించే స్థాయికి ఎదగాలి

అమరచింత: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చదువులో రాణించి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఎస్ఆర్ఐ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అమరచింతలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు చంద్రశేఖర్‌రెడ్డి తన సొంత నిధులతో అల్పాహారం పంపిణీని ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులు ఉదయం పూట ప్రత్యేక తరగతుల నేపథ్యంలో అల్పాహారం లేక ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి రావడంతో పరీక్షలు పూర్తయ్యేదాక ఈ కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో మహంకాళి విష్ణు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జుబేర్‌అహ్మద్, నాయకులు విష్ణువర్ధన్‌యాదవ్, మన్నాన్, అయ్యూబ్, తౌఫిక్, అశ్వాక్, ఉపాధ్యాయులు ఉన్నారు.



అమరచింతలో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి

జవాన్ల సేవలు వెలకట్టలేనివి



పెబ్బేరులో వీర జవాన్లకు నివాళులర్పిస్తున్న యువజన సంఘాల నాయకులు



ముందరితండాలో..



ఖిల్లాఘనపురంలో..

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): పుల్వామ దాడిలో మృతి చెందిన అమర జవాన్లకు పెద్దమందడి మండలంలోని ముందరితండా పంచాయతీలో మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేఘారెడ్డితో కలిసి గ్రామస్తులు, యువకులు కొవ్వొత్తులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమర జవాన్ల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. దేశం కోసం 40మంది జవాన్లు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వీరమరణం పొందారన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో స్థానిక యువకుల ఆధ్వర్యంలో మంగళవారం పుల్వామ దాడిలో అమరులైన జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువకులు 150 మీటర్ల జాతీయ జెండాను పట్టణంలో ప్రధాన రోడ్డుపై ర్యాలీ తీశారు. అనంతరం స్థానిక సుభాష్ చౌరస్తాలో మూడు నిమిషాలు మౌనం పాటించడంతో పాటు జాతీయ గీతం ఆలపించి మృతి చెందిన జవాన్లకు ఆత్మశాంతి కలుగాలని కోరారు.

ఖిల్లాఘనపురం: పుల్వామా బాంబు దాడిలో మృతి చెందిన వీర జవాన్ల చిత్రపటాలకు మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు భూమయ్యతో పాటు పలువురు నాయకులు వీర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు దేశరక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. దేశంపై జరిగిన అత్యంత ఘోరమైన దాడుల్లో పుల్వామా దాడి ఒకటన్నారు. కార్యక్రమంలో మునగాల బాబు, బుర్రబాలస్వామిగౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, ఖిల్లాఘనపురం సర్పంచ్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన ఆరోగ్యమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చిన ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆస్పత్రికి రావాలన్నారు. మెరుగైన వైద్యం అందించడంతో పాటుగా ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం గురించి డాక్టర్ సహీరా తెలిపారు. అనంతరం గర్భిణులకు సర్పంచ్ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటరమణ

పరామర్శ

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని 30వ వార్డుకు చెందిన రవికుమార్ మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ఉన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తూ పురిటి నొప్పులతో వచ్చే వారికి సుఖ ప్రసవాలు చేసిన నల్లపోతుల సవారమ్మ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. వైద్య వసతులు లేని కాలంలో 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన వీపనగండ్ల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణులకు మనోధైర్యాన్ని నింపి వందలాది ప్రసవాలు చేసిన సవారమ్మ మృతి మండలానికి తీరని లోటని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, పుట్ట గంగిరెడ్డి పాల్గొన్నారు.